క్లుప్తంగా

సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి సబ్‌స్టేషన్ ఆపరేటర్ మధును మద్యం మత్తులో విధులు నిర్వహించిన క్రమంలో సస్పెండ్ చేస్తూ డీఈ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. వినియోగదారుల ఫిర్యాదుతో ఏడీఈ లక్ష్మణ్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన నివేదిక ఆధారంగా మధును సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ఖానాపురం : మండలంలోని కొత్తూరులో యాదవ కుల సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ కులస్తులు ర్యాలీగా వెళ్లి బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం బాధ్యులు బాషబోయిన ఐలయ్య, జంగిలి రాజు, రాధారపు వీరస్వామి, ఐలయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం సందర్భంగా..



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో 23వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు హోమం, అర్చన, తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు బిందెలతో నీళ్లు తీసుకెళ్లి జలాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ కాశీప్రసాద్, గట్టికొప్పుల రాంబాబు, గ్రామ పెద్దలు కొట్టె ముత్తిలింగం, తదితరులు పాల్గొన్నారు.

బుక్‌స్టాల్‌పై విమర్శలు



బుక్‌స్టాల్‌లో తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

వర్ధన్నపేట : పట్టణంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థ సమీపంలో వరంగల్‌కు చెందిన బుక్‌స్టాల్ నిర్వాహకులు అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు, ఇతర వస్తువులు విక్రయించకూడదన్న నిబంధన నేపథ్యంలో స్కూల్ సమీపంలో స్టాల్ ఏర్పాటు చేశారని పలువురు మండిపడుతున్నారు. బుక్‌స్టాల్ నిర్వాహకులు చెప్పిన రేట్లకే పుస్తకాలు కొనుక్కోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీధర్‌ను వివరణ కోరగా తనకు ఫిర్యాదు అందగా తనిఖీ చేసినట్లు తెలిపారు. స్కూల్ సమీపంలో మున్సిపాల్టీ అనుమతితో అన్ని పాఠశాలలకు సంబంధించిన బుక్స్, నోట్‌బుక్స్ విక్రయిస్తున్నట్లు యజమానులు తెలిపారని చెప్పారు. స్కూల్ బయట జరిగే విక్రయాలతో విద్యాశాఖకు సంబంధం ఉండదని స్పష్టం చేశారు.

'ఇందిరమ్మ' బిల్లు చెల్లించాలి



మంజూరు పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

పర్వతగిరి : బేస్‌మెంట్ లెవల్ వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న తమకు బిల్లు చెల్లించాలని మండలంలోని జమాల్‌పురం ప్రజలు కోరారు. పలువురు లబ్ధిదారులు మంజూరు చూపుతూ విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం పూర్తి కోగా అధికారుల తప్పిదం వల్ల బిల్లు రావడం లేదన్నారు. అధికారులను కుంటి సాకులతో బాధ్యతారాహిత్యంతో మాట్లాడుతున్నారని వాపోయారు. వర్షాకాలం ప్రారంభమైన క్రమంలో పాత ఇల్లు కూల్చి కొత్త ఇళ్లు నిర్మాణం కాక, బిల్లు అందక వేదనకు గురవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు శామంతుల రమేశ్, వడ్లకొండ సారమ్మ, లాదెళ్ల హేమంత్, గోదారి శ్రీలత, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన ఘటన మండలంలోని బుధరావుపేట శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేట డివిజన్‌కు చెందిన మేస్త్రీలు మహేందర్, రమేశ్, రాంబాబు, రేణుక, సరిత, అనిల్, తదితరులు గుంజేడు ముసలమ్మ ఆలయానికి టాటా ఏసీ వాహనంలో వెళ్లి వస్తుండగా బుధరావుపేట శివారులో గుర్తు తెలియని వాహనం గేదెను ఢీకొట్టి వెళ్లింది. దీంతో బుధరావుపేటకు చెందిన సింగు అశోక్ ఖానాపురం నుంచి గ్రామానికి వెళ్తూ రోడ్డుపై గాయపడి ఉన్న గేదెను పక్కకు తప్పించేందుకు బైక్ నిలపగా టాటా ఏసీ ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో అశోక్‌తోపాటు టాటా ఏసీలో ఉన్న వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఎస్సై రఘుపతి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

యథేచ్ఛగా మొరం దందా

- రాత్రివేళల్లో తోడేస్తున్న వైనం
- బొందలగడ్డలను తలపిస్తున్న దామెర చెరువు



మట్టి తోడేయడంతో భారీ గుంతలుగా మారిన దామెర చెరువు

నర్సంపేట రూరల్ : మండలంలోని ఏజెన్సీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో యథేచ్ఛగా మొరం దందా సాగుతోంది. రాత్రివేళల్లో తోడేస్తూ దామెర చెరువును బొందలగడ్డలుగా మార్చుతున్న దుస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం తరలిస్తున్నా ఐబీ, మైనింగ్, పోలీసు, తదితర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రంగా ట్రాక్టర్లు సీజ్ చేసి జరిమానా విధిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న అపవాదు ఉంది.

నర్సంపేట పట్టణానికి కూతవేటు దూరంలో రాజుపేట ఏజెన్సీ గ్రామం ఏజెన్సీ పరిధిలోనిది. ఇక్కడ ఏ పనులు చేపట్టినా పీసా, ఇతర చట్టాల మేరకు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కాగా గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 116, 117ల్లోని అసైన్డ్ భూములను వ్యవసాయం కోసం కేటాయించారు. ఇదే అదునుగా అక్రమార్కులు మట్టి దందాకు తెగబడుతున్నారు. సదరు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, మట్టి (మొరం) ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పట్టణానికి సమీపంలో ఉండడం వల్లే..

దామెర చెరువు నర్సంపేటకు సమీపంలో ఉండడంతో చెరువులో నీరు ఎండిపోవాలని ఎదురుచూసిన అక్రమార్కులు యథేచ్ఛగా చెరువులో మట్టి (మొరం) తీయడం మొదలు పెట్టారు. దీంతో చెరువు ఆకారం కోల్పోయి బొందలగడ్డగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిఖం భూములను సైతం వదలని..

వర్షాకాలం చెరువు నిండి శిఖంలో భూముల్లో సైతం నీళ్లు నిలిచేవి. శిఖం భూముల్లో నర్సంపేటకు చెందిన సర్వాపురం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన కొందరు సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రబీలో సాగు పూర్తి కాగానే అక్రమార్కులు మట్టి తరలింపుకు తెగబడడం మొదలు పెట్టారు. రోజు 3–5 జేసీబీలతో సుమారు ట్రాక్టర్లు, టిప్పర్లలో భారీగా మొరం తరలిస్తున్నారు.

చెరువును పరిశీలిస్తాం

దామెర చెరువులో మట్టి తవ్వుతున్న విషయం మా దృష్టికి రాలేదు. చెరువును పరిశీలించి సమగ్ర నివేదిక తయారు చేసి ఐబీ, మైనింగ్ ఉన్నతాధికారులకు అందజేస్తాం. అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

\- నితిన్, ఏఈ, ఐబీ శాఖ

కేసీఆర్ దేవుడు.. రేవంత్ నరకాసురుడు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : రైతుబంధు ఇచ్చి కేసీఆర్ దేవుడుగా.. హామీలు విస్మరించి సీఎం రేవంత్‌రెడ్డి నరకాసురుడుగా ప్రజాహృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో నాయకులు, కార్యకర్తలతో సుదర్శన్‌రెడ్డి చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసగించిందన్నారు. పల్లెల్లో పాలనను గాలికి వదిలేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలులో వైఫల్యంపై నిలదీయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సత్తా లేదన్నారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రెండు కోట్ల నిధులు కూడా తీసుకరాలేదని, గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాంట్రాక్టు పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి

- యూబీఐ మేనేజర్ సర్వేశ్వర్‌రావు



మాట్లాడుతున్న మేనేజర్ సర్వేశ్వర్‌రావు

గీసుకొండ : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధించగలమని మండలంలోని కొమ్మాలలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) మేనేజర్ సర్వేశ్వర్‌రావు తెలిపారు. నందనాయక్ తండాలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సంపాదన నుంచి కొంత మొత్తాన్ని పొదుపు చేయడాన్ని అలవర్చుకోవడాన్ని ఆర్థిక అక్షరాస్యతగా అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు చైతన్యవంతం కావాలని చెప్పారు. బ్యాంకుల సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు ఎఫ్ఎల్ కౌన్సిలర్ భాస్కరాచారి, అప్రైజర్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి




మైలారంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దుబ్బతండా, మైలారం, జగన్నాధపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలే 'ఎస్ఆర్ఆర్' ధ్యేయం

ప్రజలకు సామాజిక సేవలు అందించడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారం, రాయపర్తి, రావులతండా గ్రామాలకు చెందిన యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కాట్రపల్లిలో ముస్లింల కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అసర్ ఖానా స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. తదనంతరం తిర్మలాయపల్లిలో మృతి చెందిన వంగాల మణెమ్మకు నివాళులర్పించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వరపల్లి మాజీ సర్పంచ్ యాకమ్మ భర్త ఎల్లయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు, కప్పతల్లి ఆటలు




దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల రైతులు, ప్రజలు వర్షాలు కురవాలని కోరుతూ వనభోజనాలకు వెళ్లారు. దేవతలకు మొక్కులు చెల్లించారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చారు. కప్పతల్లి ఆటలు ఆడారు. గ్రామ దేవతల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. నాచినపల్లిలో రజక కులస్తులు తడిబట్టలతో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు.

సంగెం : మండలంలోని కుంటపల్లిలోని లక్కమారి కులస్తులు వనభోజనాలకు వెళ్లి కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. మహిళలు, పురుషులు, పిల్లలు కోలాటం ఆడారు. నల్లబెల్లిలోని గ్రామదేవత బొడ్రాయి వద్ద మహిళలు కోలాటం ఆడారు.

వ్యక్తిపై కేసు నమోదు

సంగెం : మండలంలోని కాట్రపల్లిలో రెండ్రోజుల క్రితం సైడ్ కాల్వ నిర్మాణ పని చేస్తున్న కార్మికుడు కొమ్మరాజుల నగేశ్‌ను ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టిన గ్రామానికి చెందిన కత్తి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పోల్ ట్యాక్స్ రద్దు చేయాలి



నర్సంపేట : పోల్ టాక్స్ రద్దు చేయాలని కోరుతూ నర్సంపేట డివిజన్ కేబుల్ ఆపరేటర్ల సంఘం, ఉమ్మడి జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజన్ అధ్యక్షుడు జి.రాజు, ఖానాపురం మండల అధ్యక్షుడు మెరుగు గంగాధర్ నేతృత్వంలో విద్యుత్ శాఖ సీఎండి వరుణ్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కూన చక్రవర్తి, గోపు వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌లోని గ్రామ కంఠం భూమిని కబ్జాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓకు కె.వెంకన్న, రాజు, స్వామి, నాగరాజు, పి.వీరస్వామి, బి.హరీశ్, బర్ల రాజశేఖర్ వినతిపత్రం అందజేశారు. కల్లెడకు చెందిన సంపెల్లి వెంకటేశ్వరరావు ధరణిని అడ్డుపెట్టుకొని సర్వే నంబర్ లేకున్నా ప్లాట్లు చేసి విక్రయించాడని తెలిపారు. భూమి కాపాడాలని కోరారు.

అవసరం లేని మందులు అంటగడితే చర్యలు తప్పవు



సాక్షి ఎఫెక్ట్..

నల్లబెల్లి : రైతులకు అవసరం లేని బయో, ఇతర మందులు అంటగడితే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ నర్సంపేట సహాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి హెచ్చరించారు. 'యూరియా విక్రయాల్లో తిరకాసు' శీర్షికతో 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులను ఏడీఏ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల లైసెన్స్, బిల్లు బుక్స్, స్టాక్ బోర్డ్‌లను పరిశీలించారు. నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. రైతుల ఫిర్యాదులపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఓ బన్న రజిత ఉన్నారు.

రైతులకు యూనిక్ ఐడీ


దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు రైతులందరికీ యూనిక్ ఐడీ కేటాయిస్తామని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు (ఏడీఏ) దామోదర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపురం, మల్లంపల్లి గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్, రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఏఈఓల వద్ద ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కేంద్ర ప్రభుత్వం ఐడీ నంబర్ కేటాయిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలకు ఐడీ నంబర్‌ను అనుసంధానం చేస్తామని తెలిపారు. రైతులు తప్పనిసరిగా యునిక్ ఐడీ పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ మాధవి, ఏఈఓలు వైజయంతి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : చెన్నారావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన దిలావర్ మహ్మద్ అబిద్ అలీని మండలంలోని పాత ముగ్దుంపురంలోని మజీదే మహ్మదీయ మసీదులో ముస్లిం సోదరులు శుక్రవారం శాలువాతో సన్మానించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ అయ్యుం, ఇమామ్ మహ్మద్ ఇజాస్, నాయకులు మహమ్మద్ అబ్దుల్ వాహిద్, షేక్ ఖయాజ్, సలీమ్, గిర్దావర్ మహ్మద్ రషీద్, జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ అమ్జద్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి షంషొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన ఉండాలి



నర్సంపేట రూరల్ : సఖి కేంద్రాల్లో అందుతున్న సేవలపై మహిళలకు అవగాహన ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. లోని లక్నెపల్లిలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. సఖి సెంటర్లలో బాధిత మహిళలకు కౌన్సిలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయాలతోపాటు తాత్కాలిక వసతి ఉచితంగా లభిస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళా హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని చెప్పారు. సమస్యలపై వృద్ధులు టోల్ ఫ్రీ నెంబర్ 14567, పిల్లలు 1098కు ఫోన్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో సీసీ వణమ్మ, వీఓఏ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌యూబీ' ఇబ్బందులు తొలగిస్తాం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నెక్కొండ : స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)తో ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని ఆర్‌యూబీని ఆర్ అండ్ బీ ఎస్ఈ రాఘవరెడ్డితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. పట్టణంలో బ్రిడ్జి నిర్మాణంతో వ్యాపారాలు సాగక వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని అధికారులకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు బ్రిడ్జి గోడలను తొలగించడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు చేపడుతామని ఎస్ఈ చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, ఆర్ అండ్ బీ డీఈ రమాదేవి, ఏఈ గోపీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నెక్కొండ : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి



నర్సంపేట : మంజూరు పత్రం ఇస్తున్న రమేశ్



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీలో లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు శుక్రవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. బడుగులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి సదానందం, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

అమీనాబాద్ తండాలో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ తండాలో లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్ మంజూరు పత్రాలు అందజేయగా చెన్నారావుపేటలో ఇళ్ల నిర్మాణాలకు పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్ ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల్లో సిద్దబోయిన రమేశ్, నన్నెబోయిన రమేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బండి పద్మ, నాయకులు జయేందర్‌రెడ్డి, మెంతుల రమేశ్, కోల విజయ్, రుద్రమచారి, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఆవరణలో..

పర్వతగిరి : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణానికి ఎంపీడీఓ శంకర్‌నాయక్ ముగ్గుపోసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కిషన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌రావు, శ్రీనివాస్‌నాయక్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో భాగస్వాములు కండి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ అధ్యక్షతన మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సభకు రాణాప్రతాప్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నాయకత్వంలో దేశం 11 ఏళ్లలో సర్వతోముఖాభివృద్ధి సాధించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. మహిళలకు స్వావలంబన కల్పించేలా 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సభలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీను, కార్యదర్శి తడుక అశోక్ గౌడ్, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సంగెం : మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



గీసుకొండ : మాట్లాడుతున్న శ్రీనివాస్

- కాంగ్రెస్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్

సంగెం : పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిలపై చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ అధికార ప్రతినిధులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ మాట్లాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సొంత పార్టీ ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ నాగరాజు, నాయకులు రమేశ్, కిశోర్, నరహరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'రేవూరి'పై..

గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోనాయిమాకులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎమ్మెల్యేపై చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు ఆకుల రుద్రప్రసాద్, వజ్ర రాజు, సుభాశ్, రవికుమార్, రాజన్న, రాంబాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మినీ స్టేడియంలో యోగా చేయిస్తున్న శ్రీనివాస్, తదితరులు

- వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట : ప్రతిరోజూ యోగా చేస్తే అనారోగ్య సమస్యలు తొలగిపోవడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియంలో నర్సంపేట వాకర్స్ అసోసియేషన్, జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వాకర్లతో యోగా సాధన చేయించి మాట్లాడారు. స్థిరమైన యోగాసనాలతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు.

నేడు యోగా దినోత్సవం

వర్ధన్నపేట : పట్టణంలోని భారతీయ నాటక కళా సమితి ప్రాంగణంలో నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం తెలిపారు. బీజేపీ పాలన, మండల సంకల్ప సభ, శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో రచ్చబండ, యోగా దినోత్సవ వేడుకల నిర్వహణ గురించి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ప్రభారీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ మైస రాము, కార్యక్రమ కన్వీనర్ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.